క్లుప్తంగా

సుంకేసులకు 1,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు సోమవారం 1,054 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు డ్యాం అధికారులు పేర్కొన్నారు. డ్యాంలో ప్రస్తుతం 0.954 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 817 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దిగువకు నీటి విడుదలను నిలిపివేసినట్లు వారు వెల్లడించారు.

18న కర్నూలు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 18వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు కర్నూలు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భాస్కర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల, గ్రామ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

శివ స్వాములకు అన్నదానం

గూడూరు: పట్టణంలోని నీలకంఠేశ్వరి ఆలయంలో సోమవారం శివదీక్షా పరులకు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌ఐ నరేంద్ర హాజరై శివ స్వాములకు అన్నం వడ్డించారు. దీక్షా పరులకు అన్నదానం చేయడం అదృష్టం అని ఆయన పేర్కొన్నారు.

ముగిసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో కొలువైన శ్రీ హజరత్ దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ నెల 14న గంధం, 15న ఉరుసు కార్యక్రమాలను పీఠాధిపతి శ్రీ గురు సయ్యద్ అక్బర్‌బాష ఖాద్రి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం మూడవ రోజున దస్తగిరయ్య స్వామి దర్గాలో జియారత్ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల పాటు దస్తగిరయ్య స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఉరుసు ఉత్సవాలను పూర్తి చేశారు.

ఉత్సాహంగా పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడులో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని దయ యూత్ ఆధ్వర్యంలో క్రికెట్, పరుగు పందెం, మహిళలకు ముగ్గుల పోటీలను సోమవారం నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.5,016లను దాత శ్రీ రాఘవ శంకర ట్రేడర్స్, రెండవ బహుమతి రూ.3,016లను దాత కురువ పోతురాజు మద్దిలేటి, పరుగు పందెం విజేతలకు మొదటి బహుమతిగా రూ. 3016లను దాత కురువ వెంకటరాముడు, రెండవ బహుమతిగా రూ.2016లను పింజరి బజారి, ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా ఐదు తులాల వెండిని వీవీపీ యూత్, రెండో బహుమతిగా మూడు తులాల వెండిని దాత కురువ మద్దిలేటి అందించారు.

రేపు కాల్వబుగ్గలో హుండీ ఆదాయం లెక్కింపు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ పుణ్యక్షేత్రం బుగ్గ రామేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 18వ తేదీన హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ఆరు నెలలకు సంబంధించి భక్తులు హుండీలో సమర్పించిన ముడుపులు, కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి సమక్షంలో ఉదయం 10 గంటలకు లెక్కింపు కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు.

మత సామరస్యానికి ప్రతీక మీరసావలి ఉరుసు



దర్గాలో ఫతేహాలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో వెలసిన మీరసావలి నాసర్ షరీఫ్ ఉరుసు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన స్వాముల వారి ఉరుసు మహోత్సవాలు ఘనంగా జరిగాయి. సోమవారం సాయంత్రం నిర్వహించిన కిస్తీ వేడుకల్లో హిందూ, ముస్లింలు ఐకమత్యంగా పాల్గొని పూజలు చేశారు. రైతులు ఎడ్ల బండ్లపై స్వాముల వారి ప్రసాదాన్ని ఉంచి గ్రామ వీధుల గుండా మేళతాళాలతో తీసుకొచ్చి దర్గాలో స్వాముల వారికి సమర్పించి ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ జెడ్పీ చైర్మన్ మల్లెల రాజశేఖర్ దర్గాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం రాత్రి నంద్యాలకు చెందిన సయ్యద్ అబ్దుల్లా ఖాన్ ప్రదర్శించిన ఖవ్వాలి పాట కచేరి భక్తులను ఆకట్టుకుంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మల్లికార్జున పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- 'మే' లోపు సుంకేసుల–మునగాలపాడు పైప్‌లైన్ పనులు పూర్తి
- కల్లూరులో మరింత మెరుగ్గా నీటి సరఫరాకు శ్రీకారం
- మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ



అబ్బాస్‌నగర్ సంపు వద్ద తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. హంద్రీ–నీవా కాలువ నుంచి టిడ్కో సమీపంలోని ప్రెషర్ ఫిల్టర్ మీదుగా 27వ వార్డు అబ్బాస్‌నగర్ సంప్‌కు అక్కడి నుంచి కల్లూరులోని వివిధ ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే ప్రక్రియను మేయర్‌తో పాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ శ్రీకారం చుట్టారు. ఆదివారం అబ్బాస్ నగర్ నగరపాలక సంస్థకు చెందిన సంపు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మోటార్ బటన్ నొక్కి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల నుంచి అబ్బాస్‌నగర్ సంపు వరకు ఉన్న పైపులైన్‌ను వాడుకొని కల్లూరు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సుంకేసుల నుంచి మునగాల పాడు వద్ద ఉన్న స్టోరేజ్ ట్యాంకు వరకు రూ.82 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న పైపులైన్ పనులు వచ్చే మే నెలలోపు పూర్తి చేస్తామన్నారు. దీని వల్ల నూతనంగా ఏర్పడిన కాలనీల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్‌లో రోజురోజుకు కాలనీల సంఖ్య పెరుగుతోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. హంద్రీ–నీవా కాలువ నుంచి వస్తున్న నీటి ద్వారా కల్లూరు అర్బన్‌లోని 26, 27 వార్డుల్లో నీటి సరఫరా మరింత మెరుగుపడుతుందన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్‌లో అదనంగా మరో 3 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయడం ద్వారా దాదాపు 30 వేల మంది ప్రజలు నీటిని వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజలకు మెరుగైన తాగునీటిని అందించేందుకు, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నామన్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అలాగే నగరంలోని అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున మురుగు కాల్వల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం, సీసీ డ్రైన్లు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, చిన్న నరసింహులు, జయరాముడు, లక్ష్మిరెడ్డి, నారాయణ రెడ్డి, ఎస్ఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్, కర్నాటి పుల్లారెడ్డి, సాపూరు వీరయ్య, సాయి పాల్గొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలు

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనా మహోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి చిత్రపటాన్ని పల్లకీపై ఉంచి భజనలు చేస్తూ, కోలాటాలు, నృత్యాలు మధ్య కల్లూరు పురవీధుల గుండా ఊరేగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరులో జన్మించిన దత్తాంశ సంభూతుడైన రామిరెడ్డి తాత ఈ ప్రాంతాన్ని పావనం చేశాడన్నారు. టీడీపీ పాణ్యం ఇన్‌చార్జ్ గౌరు చరితా రెడ్డి, వెంకటరెడ్డి, బీజేపీ నేత బైరెడ్డి శబరిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ సేవా సంస్థాన్ సభ్యులు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు మైలాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, సంస్థాన్ కోశాధికారి హనుమంతురెడ్డి, పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల కలయిక సంక్రాంతి



శరీన్‌నగర్‌లో ముగ్గుల పోటీ విజేత రామలక్ష్మికి టీవీ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య



'సంక్రాంతి సంబరాలు' కార్యక్రమానికి హాజరైన మహిళలు

కల్లూరు: సంస్కృతి, సంప్రదాయల కలయిక సంక్రాంతి అని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లావ్యాప్తంగా మకర సంక్రాంతి, కనుమ సంబరాలు ఘనంగా జరిగాయి. కల్లూరు అర్బన్ 29వ వార్డులో సోమవారం సాయంత్రం కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో శరీన్ నగర్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల చూడముచ్చటైన ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల జడ్జిలుగా డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, నాగరత్నమ్మ వ్యవహరించారు. ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రామలక్ష్మి (టీవీ), తరువాతి స్థానాలకు అరుణకుమారి (కుట్టు మిషన్), సరస్వతి (గ్రైండర్), నాగలక్ష్మి (మిక్సీ), జానకి (ఫ్యాన్) అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్పొరేటర్లు దండు లక్ష్మికాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, కాశపోగు జయరాముడు, ఇప్పల నారాయణరెడ్డి, విక్రమ సింహారెడ్డి, లక్ష్మిరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కల్లూరు అర్బన్ 36వ వార్డులో ఆదివారం సాయంత్రం డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.
- ఉలిందకొండ, కె.మార్కపురం గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉలిందకొండలో ముగ్గుల పోటీతో పాటు, గాలిపటం పోటీలు, స్లోసైకిల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

ఇంటింటికీ రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం



ఈ తాండ్రపాడులో నిరుపయోగంగా ఉన్న రేషన్ వాహనం

కర్నూలు (న్యూటౌన్): రేషన్ సరుకులు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయడంతో ఎండీయూ ఆపరేటర్ నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ తాండ్రపాడు గ్రామంలో రేషన్ సరుకుల పంపిణీ వాహనాలు తిరగడం లేదు. వాహనం నిర్వహణకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.21 వేలు చెల్లిస్తుంది. ఇందులో ఎండీయూ ఆపరేటర్‌కు రూ.10 వేలు జీతం, హెల్పర్‌కు రూ.5 వేలు, పెట్రోల్ ఖర్చులకు రూ.3 వేలు, వాహనం ఈఎంఐ రూ.3 వేల ప్రకారం ప్రతి నెలా ఎండీయూ ఆపరేటర్ ఖాతాలో జమ చేస్తోంది. అయితే కర్నూలు మండలం ఈ తాండ్రపాడులో ఎండీయూ ఆపరేటర్ వాహనం తిప్పకుండానే ప్రతి నెలా సొమ్ము పొందుతున్నారు. సదరు వ్యక్తి రేషన్ షాపులోనే కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తుండడం గమనార్హం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ లక్ష్యం మేరకు రేషన్ వాహనాల ద్వారా సరుకులను ఇళ్ల వద్దకే అందించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా పీర్ల పండుగ



మౌలాలి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల పరిధిలోని ఆళ్లగడ్డ గ్రామంలో మౌలాలి స్వామి పీర్ల పండుగ ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కులమతాలకు అతీతంగా స్వామివారికి ప్రత్యేక ఫాతేహాలు అందజేశారు. రాత్రి నుంచి ఉదయం వరకు స్వామివారి సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. సరిగెత్తును చూడటానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. భక్తులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణారెడ్డి, సర్వేష్‌రెడ్డి, మల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



ధణిరెడ్డి రామ్మోహన్ రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ధణిరెడ్డి రామ్మోహన్ రెడ్డి (69) సోమవారం అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆరోగ్యం సరిగా లేక పోవడంతో నంద్యాలలోని ఉదయానంద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య శ్యామలాదేవి, సంతానం సతీష్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సంతాపం తెలిపారు. అలాగే మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డితో పాటు కార్యకర్తలు ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. రామ్మోహన్‌రెడ్డి కోరిక మేరకు ఆయన నేత్రాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

వైభవంగా గ్రామోత్సవం



కొత్తూరులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామి, నాగలింగేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక అభిషేక, అర్చనలు వంటి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ బీరం రాజేశ్వరమ్మ, ప్రధానార్చకులు వీరయ్య స్వామి, నారాయణ స్వామి, సురేష్‌శర్మ, గ్రామపెద్దలు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలో మంగళవారం చేపట్టే నిర్వహణ, మరమ్మతు పనుల కోసం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ రమేష్, కర్నూలు-1, రూరల్స్ ఏడీఈలు రాజమోహన్‌రెడ్డి, సుబ్బన్న, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్బైట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న 220 కేవీఏ సబ్‌స్టేషన్ నుంచి 132 కేవీఏ సబ్‌స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై ట్రాన్స్‌కో టవర్ హై పవర్ లైన్‌ను ఎత్తు పెంచేందుకు పనులు జరుగుతున్న కారణంగా సబ్ డివిజన్ల పరిధిలోని జొహరాపురం, ఉస్మానియా, వార్త కార్యాలయం, శరీన్‌నగర్, జీ.పుల్లారెడ్డి, ఆర్‌సీఎన్, ఇండస్ట్రియల్, ఎస్టేట్, మిలటరీ కాలనీలోని 33 కేవీఏ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఖడక్‌పురా మైదానం, ఉస్మానియా కళాశాల ఏరియా, మాసుంబాషా దర్గా, గాయత్రి ఎస్టేట్, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, గూగూర్ నగర్, లక్ష్మీ నగర్, మద్దూర్ నగర్, బీ.క్యాంప్, సీ.క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రీ నగర్, పోస్టల్ కాలనీ, మారుతి మెగా సిటీ, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, పార్థసారథీ నగర్, కమలానగర్, రామచంద్రనగర్, రామకృష్ణ నగర్, గుత్తి రోడ్డు, శరీన్ నగర్, అబ్బాస్ నగర్, కృష్ణానగర్, పాత బస్తీ, జొహరాపురం, ఇందిరమ్మ కాలనీ, మిలటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర కాలనీలు, చుట్టు పక్కల ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

నేడు చిన్నటేకూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ జీవీ రమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నాట్లు. మండల స్థాయి అధికారులు వారి వారి శాఖల నివేదికలతో కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.

చీటింగ్ కేసు నమోదు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు గ్రామానికి చెందిన కె.సుజాత ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు.. ఫిర్యాదురాలికి సంబంధించిన 80సెంట్ల భూమిని కర్నూలుకు చెందిన గుత్తి శశికుమార్, భావన మాయమాటలు చెప్పి వారి పేరిట రాయించుకున్నారన్నారు. దీనిపై సుజాత ఈ నెల 6వ తేదీన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు చేప్పారు. అనంతరం నిందితులను విచారించామన్నారు. వీరిపై గతంలోనే పలు ఆరోపణలు ఉన్నాయని, పలువురికి సన్నిహితులుగా నటించి వ్యక్తిగత వీడియోలు తీసి వారిని భయబ్రాంతులకు గురి చేశారనే ఆరోపణలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

పాణ్యం: మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డులో ఉన్న దర్గా వద్ద ఓ యువకుడు చనిపోగా పాణ్యం మైనారిటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. కొడుమూరుకు చెందిన ఖాదర్‌బాష (20)గత కొన్ని రోజులుగా దర్గా వద్ద ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం అతడు చనిపోవడంతో పాణ్యం మైనారిటీ సభ్యులు అంత్యక్రియలు చేశారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఆదివారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. స్థానిక మీర సావలి నాసర్ షరీఫ్ ఉరుసు మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీలు సోమవారం రాత్రి 7.30 గంటలకు ముగిశాయి. ఈ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 32 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దాడిలో ఒకరికి తీవ్రగాయాలు



దాడిలో గాయపడిన పెసల ప్రశాంత్

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పెసల ప్రశాంత్‌ను అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడు ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు.. రెండు ఇళ్ల మధ్యనున్న వేప చెట్టు విషయంలో గ్రామానికి చెందిన పెసల ప్రశాంత్ ఇంట్లో ఉండగా స్థానిక టీడీపీ కార్యకర్తలు తలారి ఎర్రగుడి యోహన్, భార్య రత్నమ్మ, కుమారుడు రామదాసు దాడికి తెగబడ్డారు. భర్త ప్రశాంత్‌ను కొడుతుండగా అడ్డువెళ్లిన తల్లి సుందరమ్మను, భార్య మహాలక్ష్మి నిండుమనిషి అని కూడా చూడకుండా విచక్షణారహితంగా దాడి చేసినట్లు బాధితులు వాపోయారు. గాయపడిన ప్రశాంత్‌ను బంధువులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు యోహన్‌పై, యోహన్ ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య చెప్పారు.

నీలం సాయినగర్‌లో భారీ చోరీ

కర్నూలు: కర్నూలు శివారులోని పెద్దపాడు రోడ్డులో గల నీలం సాయినగర్‌లో భారీ చోరీ జరిగింది. వడ్డె సురేష్‌కుమార్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉద్యోగం చేసి ఇటీవల కర్నూలులోని నీలం సాయి నగర్‌లో నివాసముంటున్నాడు. మూడు రోజుల క్రితం సంక్రాంతి పండుగ కోసం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం హెచ్.కైరవాడికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు మెయిన్ డోర్‌కు వేసిన తాళాలు పెకిలించి లోపలికి వెళ్లి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 10 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.3 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు నాలుగవ పట్టణ ఎస్‌ఐ మోహన్‌కిషోర్‌రెడ్డి తెలిపారు.

సంక్రాంతి సంబరాలు.. మురిసిన పల్లెలు



సంగాలలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



కంబదహాల్‌లో బహుమతులు అందజేస్తున్న సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు



సి.బెళగల్‌లో రూ.10 వేల నగదు బహుమతి గెలుచుకున్న శివమ్మ ముగ్గు



తుంగభద్ర నదిలో వెలసిన శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న తిమ్మందొడ్డి గ్రామస్తులు

సి.బెళగల్: తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి. అచ్చ తెలుగు గ్రామీణ ప్రాంత పండుగ భోగి, మకర సంక్రాంతి, కనుమలను ప్రజలు ఆనందాలతో జరుపుకున్నారు. ఆదివారం మకర సంక్రాంతి సందర్భంగా సి.బెళగల్‌తో పాటు సంగాల, కంబదహాల్ తదితర గ్రామాలలో ముగ్గుల పోటీలను ఆయా గ్రామాల ఫ్రెండ్స్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను పంపిణీ చేశారు.

- సంగాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలో 31 మంది పాల్గొనగా గ్రామానికి చెందిన శివమ్మ వేసిన ముగ్గు మొదటి స్థానంలో నిలిచి మిక్సర్‌ను బహుమతిగా పొందింది. మౌనిక, అమృత, శైలజ, శ్రీలత ముగ్గులు తరువాతి స్థానాల్లో నిలిచి బహుమతులు కైవసం చేసుకున్నాయి. అలాగే సి.బెళగల్‌లోనూ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న శివమ్మ 'రైతే రాజు' అన్న అంశంతో రూపొందించిన ముగ్గు రూ.10 వేల బహుమతి గెలుచుకోవడంతో పాటు అందరి మన్ననలు పొందింది.
- కంబదహాల్ గ్రామం మగ్గాలకట్ట కాలనీలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు సీఐడీ డీఎస్పీ శ్రీనివాసులు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో 48 మంది పాల్గొనగా రజిత, సమీర, బీసీ రజిత, జయలక్ష్మి, నిఖితకుమారి మొదటి ఐదు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.
- తిమ్మందొడ్డి గ్రామస్తులు ఆదివారం సాయంత్రం తుంగభద్ర నదిలో నందీశ్వరులు కొలువైన బండ దగ్గరకు చేరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాల్లో తినుబండారాలు, చెరకులు, చిన్నారులకు బొమ్మలు, గాజులు కొనుగోలు చేశారు.

గడివేముల: గడివేముల నిర్వహించిన పారువేట కార్యక్రమంలో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ సంతోషంగా పాల్గొన్నారు. గ్రామ పురవీధుల్లో స్వామివారి ఉత్సవ మూర్తులను ఊరేగింపు నిర్వహించారు. భోగేశ్వరాలయం, మూల పెద్దమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



గడివేములలో పారువేట నిర్వహిస్తున్న గ్రామస్తులు

గూడూరు: సంక్రాంతి సందర్భంగా ఆది, సోమ వారాలలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ ఆటల పోటీలు అలరించాయి. స్ఫూర్తి యూత్ ఆధ్వర్యంలో వాల్మీకి దేవాలయం ఆవరణలో బైక్ బ్యాలెన్స్, తిండిపోటీలు, వాలీబాల్, పరుగు పందెం పోటీలు నిర్వహించారు. ఎస్‌ఐ నరేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న హాజరై విజేతలకు బహుమతులు అందించారు.



గూడూరులో పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ నరేంద్ర, తదితరులు